# 2011 గ్రూపు 1 రాసిన వారందరికీ మరోసారి అవకాశం

**ఈనాడు, హైదరాబాద్:** గ్రూపు-1, 2011 ప్రధాన పరీక్షల్ని మరోసారి నిర్వహిస్తున్న నేపథ్యంలో.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఈ పరీక్షను రాసిన వారందరికీ సుప్రీంకోర్టు ఆదేశాలు అనుసరించి మళ్లీ అవకాశం కల్పిస్తామని ఏపీపీఎస్సీ అధ్యక్షుడు ఉదయ్ భాస్కర్ తెలిపారు. అప్పట్లో జరిగిన పరీక్షలకు గైర్హాజరైన వారికి మాత్రం అవకాశం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో తెలంగాణ అభ్యర్థుల్ని స్థానికేతర కోటాలో అర్హతల్ని అనుసరించి ఎంపిక చేస్తామని పేర్కొన్నారు.

# పేపరు మారిన ఎల్‌ఎల్‌బీ పరీక్ష రద్దు

**ఈనాడు, హైదరాబాద్:** ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో ఎల్‌ఎల్‌బీ ప్రథమ సంవత్సరం రెండో సెమిస్టర్‌లో పేపర్-1 జనరల్ ఇంగ్లీష్-2 పరీక్షను మళ్లీ నిర్వహించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నెల 12 జరిగిన ఈ పరీక్షకు సంబంధించి ప్రశ్నపత్రం మారింది. అయినా అధికారులు పరీక్షను నిర్వహించేశారు. విద్యార్థులు జవాబుల కింద ఏం రాసినా మార్కులు వేసేందుకు సిద్ధమయ్యారు. దీనిని 'ఈనాడు' వెలుగులోకి తీసుకురావడంతో ఉపకులపతి రాజేంద్రప్రసాద్ బుధవారం సంబంధిత అధికారులతో సమావేశమై చర్చించారు. ప్రాథమిక చర్య కింద ఆ పరీక్షను రద్దు చేసి, మళ్లీ నిర్వహించాలని నిర్ణయించారు.